APTEL/26A5612

# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు — తెలుగు దినపత్రిక

అనంతపురం | బుధవారం 23 సెప్టెంబర్ 2026 | సంపుటి : 1 | సంచిక : 85 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | పేజీలు : 8 | వెల : 2/-




## భారత్- ఒపెక్ చమురు బంధం మరింత బలోపేతం

- ఢిల్లీలో ఉన్నత స్థాయి చర్చలు విజయవంతం!
- ఢిల్లీలో విజయవంతంగా ముగిసిన భారత్
- ఒపెక్ 7వ ఉన్నత స్థాయి ఇంధన చర్చలు
- చమురు మార్కెట్లో స్థిరత్వం, ఇంధన భద్రతపై సమావేశం
- పరస్పర సహకారానికి అంగీకారం!



## రామమందిరంలో 105 సార్లు విరాళాల చోరీ



## కోస్తాంధ్రకు భారీ వర్ష ముప్పు

**హెచ్చరికలు జారీ చేసిన హోంమంత్రి**

**బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది**

**కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది.**

**అమరావతి**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది. కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. రాష్ట్ర హోంమంత్రి అనిత పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని హై అలర్ట్‌లో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ప్రస్తుతం వాయుగుండం కొనసాగుతోంది. ఇది రానున్న 24 - మిగతా3లో

# కూటమి మరింత బలంగా ఉండాలి




- అధికారంలోకి వచ్చాక నాయకుల్లో వేడి తగ్గింది
- కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండోరోజు పర్యటించారు
- పిఠాపురంలో రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులకు పవన్ శ్రీకారం
- పిఠాపురం భహిరంగ సభలో ఉపముఖ్యమంత్రి పవన్
- 'పిఠాపురంలో శాశ్వత డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాం
- రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో 2 ఎస్‌పీటీల నిర్మాణం చేపట్టాం.

**కాకినాడ**

కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండో రోజు పర్యటించారు. ఇందులో భాగంగా రూ.1500 కోట్లతో పలు అభివృద్ధి పనులను ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్స వాలు చేశారు. మంగళవారం ఉదయాన్నే పవన్ తన పర్యటనను ప్రారంభించారు. తొలుత గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీసీతారామ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు పథకాల లబ్ధిదారుల కు సంబంధిత పత్రాలను అందజేశారు. ఆ తర్వాత ఆర్ఆర్‌బీహె చ్ఆర్ మైదానంలో నిర్వహించిన 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' బహిరంగ సభలో పవన్ పాల్గొన్నారు. 30 మంది మత్స్యకారులకు రక్షణ పరికరాలు అందించారు. నివాస గృహాల క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, విద్యార్థులకు బ్యాగులు ఇచ్చారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కులు అందించారు. రైతు సంఘం నాయకులు పవన్ కల్యాణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపి, నాగలిని - మిగతా3లో

# ఆర్థిక కేంద్రంగా కుప్పం అభివృద్ధి




- ఎకనామిక్ హబ్‌గా కుప్పాన్ని అభివృద్ధి చేస్తాం
- కుప్పం అభివృద్ధిలో మరో మైలురాయి..
- దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్ ప్రారంభించిన చంద్రబాబు
- మొత్తంగా కుప్పంలో దాదర్--పుదుచ్చేరి, వాస్కోడగామా--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ల ప్రారంభంతో రైల్వే సౌకర్యాల విస్తరణలో మరో ముందడుగు

**కుప్పం**

కుప్పం ప్రజలకు రైల్వే ప్రయాణ సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా మరో కీలక అడుగు పడింది. దాదర్–పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడిన సీఎం.. వారి సమస్యలు, విజ్ఞప్తులను స్వీకరించారు. భవిష్య త్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించడంతో పాటు కుప్పా న్ని ఆర్థిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడిం చారు. కుప్పం ప్రజలకు రైల్వే ప్రయాణ - మిగతా3లో

## పార్లమెంట్‌లో కొత్త రికార్డు

- 40 రోజులైనా ముగియని సెషన్
- కేంద్రం ప్లాన్ ఏంటి?
- ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డ లోక్‌సభ, రాజ్యసభ
- సాధారణంగా మూడు, నాలుగు రోజుల్లోనే ప్రొరోగ్ అయ్యే సమావేశం
- 40 రోజులుగా అధికారికంగా ముగింపు ప్రకటన లేకపోవడం ఇదే తొలిసారి





## ఉగ్రవాదంపై ప్రకటనలు కావు చర్యలు ముఖ్యం

- పాకిస్థాన్‌పై భారత్ కీలక వ్యాఖ్యలు
- బంగ్లాదేశ్‌తో సంబంధాలపైనా ప్రకటన
- సరిహద్దు ఉగ్రవాదానికి సంబంధించి భారత విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు

# అక్టోబర్ 1న తుది జాబితా



- మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియ
- 9 రోజుల పాటు నిర్వహణ
- మున్సిపల్ ఎన్నికలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియ
- రేపట్నుంచి నుంచి 9 రోజుల పాటు ప్రక్రియ నిర్వహణకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల గుర్తింపు ప్రక్రియ రేపటి (సెప్టెంబర్ 23) నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలి విడతగా రాష్ట్రంలోని 12 నగరపాలక సంస్థలు, 29 మున్సిపాలిటీలు/నగర - మిగతా3లో



# టీడీపీకి సేవే లక్ష్యం

- డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుకుందాం.. మంత్రి నారా లోకేశ్ సవాల్
- ఎక్కడున్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరిక..
- డీఎస్సీ, ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై చర్చకు సిద్ధమని వెల్లడి
- 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్న లోకేశ్
- కార్యకర్తల కోసం ప్రమాద బీమా, రూ.175 కోట్ల సాయం

**అమరావతి**

ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీలోనే కాదు.. అండమాన్, ఆస్ట్రేలియాలో ఉన్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరించారు. తనపై కోపం ఉంటే నేరుగా తనతో తేల్చుకోవాలని అన్నారు. డేట్, టైమ్ ఫిక్స్ చేసుకుని మాట్లాడుకుందామని చెప్పారు. డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దామని సవాల్ చేశారు. తమది నీతి, నిజాయతీలతో బతికిన కుటుంబమని లోకేశ్ అన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులు జైలులో పెట్టారని చెప్పారు. ఆయనపై పెట్టిన ఒక్క కేసు కూడా నిలబడలేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు ఎందుకు భయపడతామని ప్రశ్నించారు. జగన్‌పై విమర్శలు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ప్రకటించలేదని, ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని లోకేశ్ విమర్శించారు. బాబు తొలి సంతకం డీఎస్సీపైనే చేశారని తెలిపారు. దాన్ని ముందుకు సాగనీయకుండా వైసీపీ నాయకులు 300 కేసులు వేశారని చెప్పారు. 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని పేర్కొన్నారు. వారికి అమరావతిలో - మిగతా3లో

# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు

## రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా


.....జర్నలిస్టుల కోసం పుట్టపర్తిలో....

## ఉచిత మెగా వైద్య శిబిరం.

.....శ్రీ సత్యసాయి జిల్లాలో సెప్టెంబర్ 26న ప్రత్యేక కార్యక్రమం.

.....వైదేహి, స్విమ్స్, బసవతారకం ఆసుపత్రుల నిపుణులచే వైద్య పరీక్షలు.

క్యాన్సర్ ప్రారంభ గుర్తింపునకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు.

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక సహకారంతో ఏర్పాటు.

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్







## సిద్ధాంతాల నేత పరిటాల రవి..!!

.....గొడ్డలి నేతలను వదలను అన్ని చూస్తున్న భయ్యా..!!

.....స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి

....మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే!లి

....డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం..జగన్ రెడ్డి సిద్ధమా?లి

....స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నా

....పాదయాత్రలో నాతో నడిచిన వారిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటాలి

....రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాల ఆవిష్కరణ సభలో మంత్రి లోకేష్.

పాల్గొన్న... మంత్రి సవితమ్మ, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు, సింధూర రెడ్డి, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి





**రాప్తాడు: సెప్టెంబర్ 22 తెలుగు స్వరం.**

మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. జగన్ రెడ్డి సిద్ధమా అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరోసారి సవాల్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు కూడలిలో ఏర్పాటుచేసిన స్వర్గీయ అన్న నందమూరి తారకరామారావు, మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ పరిటాల రవీంద్ర విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ముందుగా భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఈ రోజు మనం వేదికపై ఉన్నామంటే కారణం వేదిక కింద ఉన్న టీడీపీ కార్యకర్తల త్యాగం వల్లే. ఈ రోజు నేను స్వర్గీయ ఎన్టీఆర్ మనవడిగా, సీఎం చంద్రబాబు తనయుడిగా, బాలయ్య మావయ్య అల్లుడిగా రాలేదు. ఎత్తిన పసుపు జెండా దించకుండా, మడమ తిప్పకుండా, టీడీపీకి - మిగతా3లో



## హైబ్రిడ్ మోడల్‌గా అనంత..!!

.....హైబ్రిడ్ యాన్యుటి మోడల్ పథకం ద్వారా రూ.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కార్యక్రమంలో పాల్గొన్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, తదితరులు.



**అనంతపురం, సెప్టెంబర్ 22 తెలుగు స్వరం.**

హైబ్రిడ్ యాన్యుటి మోడల్ (నూావీ) పథకం ద్వారా అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో 50కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. నూావీ మోడల్‌లో తొలిసారిగా రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు రూ.11,360 కోట్ల పనులను వర్చువల్ ప్రారంభించారు. 26 జిల్లాల్లో 106 నియోజకవర్గాల్లోని.. 123 మున్సిపాలిటీల్లో పనులు ఒకేసారి ప్రారంభించారు. ఇందులో భాగంగా అనంతపురం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు. 50 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 1300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతపురం - మిగతా3లో

## కోట్ల నిధుల వరదతో... కదిరికి కందికుంట బ్రాండ్..!!

....రూ.29 కోట్ల కదిరి పట్టణ అభివృద్ధికి నిధులు.

.....కదిరి పట్టణనాన్ని మరింత అభివృద్ధి చేస్తాం ఎమ్మెల్యే కందికుంట.

**కదిరి, నంబులపూలకుంట, సెప్టెంబర్ 22 తెలుగు స్వరం (బ్యూరో)**



కదిరి పట్టణ అభివృద్ధి కోసం రూ. 29 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి పట్టణ అభివృద్ధితో రూపురేఖలను మారుస్తామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కదిరి పట్టణంలోని తాయి గ్రాండ్‌లో కదిరి పట్టణ అభివృద్ధికి సంబంధించిన మంగళవారంకార్యక్రమ నిర్వహించారు.కుప్పంలో ముఖ్యమంత్రి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో పాల్గొని ప్రసంగించే విధానాన్ని ప్రొజెక్టర్ ద్వారా పట్టణంలోని కూటమి నాయకులు,కార్యకర్తలు తిలకించారు.కదిరి మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి ఎన్నడూ లేని విధంగా దాదాపు రూ.29 కోట్ల హైబ్రిడ్ యాన్యుటీ పథకం నిధులతో కదిరి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నామని కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు.కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అభివృద్ధే కూటమి ప్రభుత్వానికి రాజకీయ సమాధానంఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ కదిరి పట్టణానికి దాదాపు రూ.29 కోట్ల హైబ్రిడ్ యాన్యూటీ పథకంలో నిధులు తీసుకురావడం మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులతో ప్రజలకు సమాధానం చెప్పే కూటమి ప్రభుత్వ విధానానికి నిదర్శనం అన్నారు.గతంలో అధికారంలో ఉన్నవారు అభివృద్ధి గురించి ఎన్ని మాటలు చెప్పినా ప్రజల ముందున్న వాస్తవం ఏమిటో ప్రజలే గమ నించారు. ఇప్పుడు కదిరి పట్టణానికి భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నాం. ప్రజలకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదు అభివృద్ధి, మౌలిక వసతులు, సంక్షేమం. కూటమి ప్రభుత్వం - మిగతా3లో

# సిద్ధాంతాల నేత పరిటాల రవి..!!

-మొదటిపేజీ తరువాయి

కాపలాకాసిన కార్యకర్తగా ఇక్కడకు వచ్చాను. అన్న ఎన్టీఆర్ ఏ ముహూర్తంలో పార్టీని స్థాపించారో తెలియదు. నాకు అక్కతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లు లేరు, కానీ కోటి మంది కుటుంబ సభ్యులను ఇచ్చారు. మీ పౌరుషమే వేరు. అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. రాజకీయాల్లో, సినిమాల్లో స్వర్గీయ ఎన్టీఆర్ స్టైలే వేరు. ఆనాడు యువగళంలో దారి పొడవునా ప్రజలు నాకు నీరాజనాలు పలికారు. పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ఆనాటి సంబరం మళ్లీ ఈనాడు చూస్తున్నా.

**నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు పోరాడిన వ్యక్తి పరిటాల రవి**

నేను కూడా అన్న ఎన్టీఆర్ సీఎం అయిన తర్వాతనే పుట్టా. రూ.2కే కిలో బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎన్టీఆర్ గారు చేపట్టారు. ఈ రోజు మనందరం అన్న ఎన్టీఆర్ గారి వారసులం. ఈ రోజు మనం ఎక్కడికి వెళ్లినా గర్వంగా చెప్పుకోవచ్చు.. నా పార్టీ తెలుగుదేశం, నా పార్టీ, నా అజెండా అన్న ఎన్టీఆర్ అని. చంద్రబాబు గారు మొదటిసారి ముఖ్యమంత్రి అయినా అభివృద్ధి, సంక్షేమం చేశారు. పరిటాల రవి గారు కూడా ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పనులు చేశారు. మన పార్టీ అధికారంలోకి రాకముందు రాయలసీమలో మహిళలు బయట తిరగాలంటే బయపడే పరిస్థితి. దానికి ఫుల్ స్టాప్ పెట్టిన నాయకుడు మన పరిటాల రవీంద్ర గారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేశారు. ఆనాడు వందలాది మంది మన కార్యకర్తలను హత్య చేశారు. అయినా పరిటాల రవి గారు ఏనాడు భయపడలేదు. పార్టీ సమావేశానికి వెళ్తే చంపేశారు. అయినా ఆ కుటంబం వెనక్కి తగ్గలేదు. పరిటాల సునీతమ్మ ముందుకు వచ్చారు. అసెంబ్లీలో బయపెట్టినా ఆమె భయపడలేదు. పార్టీని ముందుకు తీసుకెళ్లారు. ఇప్పుడు పరిటాల శ్రీరామ్ ని కూడా పార్టీకి అంకితం చేశారు.

**ఫైటర్ జెట్ తయారీ ఏఎంసీఏ ప్రాజెక్ట్ ను అనంత గడ్డకు తీసుకువచ్చాం**

రాప్తాడు ప్రజలు చాలా మంచివారు. ప్రజలను కలిసినప్పుడు ఇప్పుడు ఎవరూ నా చేతులను గీరలేదు. ధర్మవరంలో అయితే మొత్తం గీరేశారు. కార్యకర్తలు, నాయకులు 2019-24 మధ్య పడిన కష్టాలను గుర్తుచేసుకోవాలి. జీవో 1 ద్వారా యువగళం పాదయాత్రను అడ్డుకోవాలని చూశారు. స్టూల్, మైక్ లాక్కున్నారు. అయినా ఎక్కడా తగ్గలేదు. వేదిక ముందున్న నాయకులు, కార్యకర్తల ప్రోత్సాహంతో ఆనాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో యువగళం పాదయాత్ర చేశా. ఇక్కడి ప్రజల కష్టాలను చూశా. అందుకే దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫైటర్ జెట్ లు తయారుచేసే ఏఎంసీఏ ప్రాజెక్ట్ ను మన అనంతపురం గడ్డకు తీసుకువచ్చా. సాగు, తాగునీరు, పరిశ్రమలను తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రత్యేకంగా నాపై బాధ్యత ఉంది. ఎందుకంటే అన్న ఎన్టీఆర్ ను, హరి మావయ్య, బాలయ్య మామను గెలిపించి శాసనసభకు పంపించిన అద్భుతమైన నేల ఇది. తాగునీరు, సాగునీరు అందిస్తాం.

కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. ఎన్నికలు.. ఎన్నికలే.. తగ్గేదేలే. కష్టపడాలి, పనిచేయాలి. మనది పెద్ద కుటుంబం. కోటి ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారు. మన కుటుంబం పెద్దదైంది. ఇప్పుడు పవనన్న కూడా మన కుటుంబ సభ్యుడు అయ్యారు. బీజేపీ కూడా మన కుటుంబంలో చేరింది. మూడు పార్టీలు ఏపీని ముందుకు తీసుకెళ్తున్నాయి. సమస్యలు ఏవైనా ఉంటే నాలుగు గోడల మధ్య కూర్చొని పరిష్కరించుకుందాం. నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి అందరూ కట్టుబడి ఉండాలి. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి గౌరవిస్తాం. మన రాష్ట్రాన్ని మనందరం కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది.

**మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే!**

గొడ్డలితో బతికినవాళ్లు గొడ్డలితోనే పోతారు. పాఠాలు చెప్పే టీచర్లపై ఎలా దాడి చేశారో చూశాం. అయ్యా జగన్.. ఎందుకు మా ఉపాధ్యాయులంటే నీకు అంత కక్ష. డీఎస్సీపై చర్చకు సిద్ధమని నేను ఎన్నోసార్లు చెప్పా. నేను సిద్ధం.. నువ్వు సిద్ధమా? జగన్ రెడ్డి మాదిరిగా ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లాలంటే మాకు కోర్టు అనుమతి అవసరం లేదు. నీతి, నిజాయతీతో బతికినవాళ్లం. జగన్ రెడ్డి పెట్టిన కేసులు దొంగ కేసులని ఏకంగా సుప్రీంకోర్టే తేల్చిసిన పరిస్థితి. జగన్ రెడ్డి జాగ్రత్తగా ఉండు.. మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. ఉపాధ్యాయులపై దాడికి రౌడీమూకలను పంపారు. మొన్నటి వరకు మన పార్టీలో వంగి, వంగి ఉన్నారు. ఇప్పుడు అక్కడకు వెళ్లి కాలరెగరేస్తున్నారు. వదిలిపెట్టను భయ్యా! అన్నీ చూస్తున్నా. ఉపాధ్యాయులపై కోడిగుడ్లు వేస్తారా? అసభ్యంగా మాట్లాడతారా? అసలు మీరెక్కడ చదివారు? ఎవరు చదివించారు? ఇదేనా ఇంట్లో మీ తల్లిదండ్రులు నేర్పించిన సంస్కృతి? ఇదేనా ఉపాధ్యాయులకు మీరిచ్చే గౌరవం. నేను వదిలిపెట్టను. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టేది లేదు. రెడ్ బుక్ కు కట్టుబడి ఉన్నా. ప్రజలకు కూడా చెప్పా. వారి ఆశీస్సులతో 94శాతం స్థానాలు కైవసం చేసుకున్నాం. ఇక్కడున్న కార్యకర్తలకు ఒకటే చెబుతున్నా.. కష్టపడదాం, ప్రజలకు సేవచేద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి. ఈగో వద్దు, ప్రజల్లోఉందాం.

**పాదయాత్రలో నాతో నడిచిన వారిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా**

రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి గారి విగ్రహాలను ఆవిష్కరించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ రోజు నా తమ్ముడు పరిటాల శ్రీరామ్ పుట్టిన రోజు. నా తమ్ముడు పుట్టినరోజు నాడు విగ్రహాలను ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నా. శ్రీరామ్ కు ఉదయం లేచిన వెంటనే పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ మొదటి మెసేజ్ పెట్టింది నేనే. ఒక్కసారి నమ్మితే నేను వదిలిపెట్టను. ఆనాడు పాదయాత్రలో నాతో నడిచిన వారు, ఆనాడు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మీరు నన్ను నడిపించారు. నా జీవితాంతం మిమ్మల్ని నా గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని చెప్పారు. తనకు ఘనస్వాగతం పలికిన రాప్తాడు ప్రజలకు ఈ సందర్భంగా మంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, మంత్రి ఎస్.సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే, హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు ఎం.ఎస్ రాజు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకట ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, హిందూపురం పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

# కోట్ల నిధుల వరదతో... కదిరికి కందికుంట బ్రాండ్..!!



-మొదటిపేజీ తరువాయి

ఆ దిశగా పనిచేస్తోంది" అని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సీటు ఎవరికి వచ్చినా అభ్యర్థి ఒక్కరే కాదు కూటమి అభ్యర్థి. వ్యక్తిగత అభిప్రాయాలను పక్కన పెట్టి టీడీపీ, జనసేన,బీజేపీ, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి అని అన్నారు.వైసీపీకి కదిరిలో రాజకీయంగా ప్రజల నుంచి మద్దతు లేదనిగత ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ప్రజల తీర్పు స్పష్టంగా ఉందనిఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి నాయకులు సమష్టిగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆయన అన్నారు. వైసీపీ రాజకీయాలకు ప్రజలు స్వస్తి చెప్పి అభివృద్ధి వైపు చూస్తున్నారు. కదిరి అభివృద్ధి కోసం ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు కేవలం రాజకీయాలు చేస్తున్నారో ప్రజలే నిర్ణయిస్తారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధే మా సమాధానం" అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారు స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా కదిరి నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## హైబ్రిడ్ మోడల్‌గా అనంత..!!




-మొదటిపేజీ తరువాయి

నగరంలో ఓల్డ్ టౌన్ సహా అన్ని ప్రాంతాలకు ప్రతి రోజు తాగునీరు అందించడంతో పాటు మురుగునీరు శుద్ధి చేసే విధంగా భారీ శుద్ధి కేంద్రాన్ని రూ.107.71 కోట్లతో ప్రారంభించామన్నారు. ఇప్పుడు తాజాగా విడుదల చేసిన 50 కోట్ల రూపాయలతో రోడ్లు, పార్కులు, డివైడర్లు, వీధి లైట్లను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. వచ్చే నెలలో 160 కోట్ల రూపాయలతో డ్రైనేజీల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చాక.. స్థానిక సంస్థల నుంచే వచ్చే ఆదాయాన్ని అక్కడే వినియోగించుకునేలా జీఓ ఇచ్చారన్నారు. 62 డివిజన్లలోనూ ప్రస్తుతం మేము చేసిన అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఆయా శాఖల డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేష్, కొండన్న, దాసరి చంద్రకళ, ప్రశాంతి, గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

## .....జర్నలిస్టుల కోసం పుట్టపర్తిలో....ఉచిత మెగా వైద్య శిబిరం.

**పుట్టపర్తి సెప్టెంబర్,22 తెలుగు స్వరం.**

సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు గౌరవనీయ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి ప్రత్యేక సహకారంతో పుట్టపర్తిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

ఈ వైద్య శిబిరం 2026, సెప్టెంబర్ 26న పుట్టపర్తిలోని 'సాయి ఆరామం ఫంక్షన్ హాల్' నందు ఉదయం నుండి ప్రారంభమవుతుంది.ఈ మెగా వైద్య శిబిరంలో దేశంలోనే ప్రముఖ వైద్య సంస్థలైన వైదేహి హాస్పిటల్ (బెంగళూరు), స్విమ్స్ - స్విమ్స్ (తిరుపతి), మరియు బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కు చెందిన పలువురు ప్రముఖ స్పెషలిస్ట్ మరియు సూపర్ స్పెషలిస్ట్ వైద్య నిపుణులు పాల్గొని జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన సలహాలు మరియు సూచనలు అందించనున్నారు.జర్నలిస్టుల ఆరోగ్య స్థితిని సమగ్రంగా పరిశీలించడానికి ఈ క్రింది ముఖ్యమైన పరీక్షలు ఉచితంగా నిర్వహించబడతాయి.

ఈసీజీ ,2డి ఏచో , ఎక్స్ రే అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఇతర వివిధ స్పెషాలిటీ మరియు సూపర్ స్పెషాలిటీ వైద్య తనిఖీలు క్యాన్సర్ స్క్రీనింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత,ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ఈ శిబిరంలో క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించే ఉచిత ప్రత్యేక పరీక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. బసవతారకం మరియు ఇతర ఆసుపత్రుల నిపుణులు అందించే ఈ స్క్రీనింగ్ ద్వారా అవసరమైన వారికి తదుపరి వైద్య చికిత్సలపై స్పష్టమైన మార్గదర్శకత్వం చేస్తారు. జర్నలిస్టులందరికీ ఆహ్వానం: వృత్తిగత ఒత్తిడిలో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ మీడియా జర్నలిస్టులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

# ఆర్థిక కేంద్రంగా కుప్పం అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా మరో కీలక అడుగు పడింది. దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడిన సీఎం.. వారి సమస్యలు, విజ్ఞప్తులను స్వీకరించారు. భవిష్యత్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించడంతో పాటు కుప్పాన్ని ఆర్థిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.



**కుప్పంలో దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్**

కుప్పం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరింది. రైలు నంబర్ 11005 దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్ కల్పించారు. ఈ హాల్ట్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా వాస్కోడగామ--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్‌ను కూడా ప్రారంభించారు. ఈ అదనపు హాల్ట్‌లతో కుప్పం ప్రజలకు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడం మరింత సులభం కానుంది. ప్రయాణికులకు మెరుగైన రైలు కనెక్టివిటీ అందించడంతో పాటు స్థానిక అవసరాలకు అనుగుణంగా రైల్వే సేవలను విస్తరించేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి. చంద్రబాబు నాయుడు స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడుతూ కుప్పంలో ప్రస్తుతం 59 రైళ్లకు హాల్ట్‌లు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించేలా ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు.

**కుప్పాన్ని ఎకనామిక్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం**

కుప్పం ప్రాంతం క్రమంగా ఎకనామిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు తెలిపారు. రైల్వే కనెక్టివిటీని మరింత మెరుగుపరచడం ద్వారా ఈ ప్రాంతానికి ఆర్థికంగా కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కుప్పాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానించి, రాబోయే రోజుల్లో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తే పర్యాటక రంగం అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని వివరించారు. కుప్పం ప్రాంతంలో రైల్వే సంబంధిత మౌలిక సదుపాయాల అభివృద్ధిపైనా కీలక విషయాలను వెల్లడించారు. గుడిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. డీకే పల్లి చెరువు సమీపంలో కూడా ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు ముందుకు సాగితే స్థానిక ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది.

బెంగళూరు--చెన్నై నాలుగు వరుసల రైల్వే లైన్: బెంగళూరు--చెన్నై మధ్య నాలుగు వరుసల రైల్వే లైన్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు తెలిపారు. ఈ రైల్వే కనెక్టివిటీ కుప్పం ప్రాంతానికి కూడా ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే కుప్పం నుంచి చిత్తూరుకు రైల్వే కనెక్టివిటీ కల్పిస్తే నేరుగా తిరుపతికి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ఈ దిశగా కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందించవచ్చని తెలిపారు.

కుప్పం ప్రాంతం నుంచి రైల్ కార్గో రవాణాకు కూడా పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. పొగురుపల్లి సమీపంలోని డ్రై పోర్టును రైల్వే కనెక్టివిటీతో అనుసంధానించి కార్గో రవాణాను మెరుగుపరుస్తామని వెల్లడించారు. దీంతో సరకు రవాణాకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో రైల్వే కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. సమీప భవిష్యత్తులో బెంగళూరు నుంచి అమరావతికి వందే భారత్ రైళ్లను నడిపేలా కృషి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మధ్య ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంటుంది.

**కుప్పం అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ కీలకం**

మొత్తంగా కుప్పంలో దాదర్--పుదుచ్చేరి, వాస్కోడగామ--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ల ప్రారంభంతో రైల్వే సౌకర్యాల విస్తరణలో మరో ముందడుగు పడింది. అదనపు హాల్ట్‌లు, ఆర్వోబీల ప్రతిపాదనలు, కార్గో రవాణా, ఇతర ప్రాంతాలతో రైల్వే అనుసంధానం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. కుప్పాన్ని ఆర్థిక కేంద్రంగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలు అమలులోకి వస్తే స్థానిక ప్రజలకు ప్రయాణ సౌకర్యాలతో పాటు వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది.

## టీడీపీకి సేవే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని అన్నారు. అబద్ధానికి ప్యాంటు, షర్టు వేస్తే వచ్చే రూపమే జగన్ అంటూ లోకేశ్ వ్యాఖ్యానించారు. నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుందనే శాపం ఆయనకు ఉందంటూ విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు వచ్చి డీఎస్సీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారని చెప్పారు.

టీడీపీలో తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తమ నాయకత్వ లక్ష్యమని చెప్పారు. పరిటాల శ్రీరామ్ లాంటి యువ నాయకత్వం పార్టీలో ఉందన్నారు. వైసీపీ నాయకత్వానికి, టీడీపీ నాయకత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఎన్టీఆర్, చంద్రబాబు నేర్పిన క్రమశిక్షణతోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు.

**పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం**

కార్యకర్తే అధినేత నినాదాన్ని ఆచరణలో అమలు చేస్తున్నామని లోకేశ్ చెప్పారు. కార్యకర్తల త్యాగాలను చంద్రబాబు మరువరని అన్నారు. కార్యకర్తల కోసం ప్రమాద బీమా తీసుకొచ్చామని తెలిపారు. రూ.175 కోట్లు కార్యకర్తలకు అందించి ఆదుకున్నామని చెప్పారు. కార్యకర్తల ఆరోగ్యాన్ని చూసుకునే బాధ్యత తనదేనని పేర్కొన్నారు.

**పనిచేస్తే పదవులు వస్తాయి**

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తిస్తామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తలు తాము చేస్తున్న కార్యక్రమాలను మై టీడీపీ యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయని అన్నారు. పనిచేయకుండా పదవులు రావాలంటే

## అక్టోబర్ 1న తుది జాబితా

-మొదటిపేజీ తరువాయి

పంచాయతీలలో 9 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు కీలకమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రేపట్నుంచి నుంచి 9 రోజుల పాటు ఈ ప్రక్రియ నిర్వహణకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. 12 నగరపాలక సంస్థలు, 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోఈ ప్రక్రియను చేపడతారు. 23 నుంచి 25 వరకు. ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను వార్డుల వారీగా బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తారు. 26న ఈ జాబితాలు ఆయా మున్సిపల్ వార్డులలో ముసాయిదాగా ప్రకటిస్తారు. 27, 28 తేదీలలో ముసాయిదా ఓటర్ల గుర్తింపుపై వచ్చిన అభ్యంతరాలను స్వీకరిస్తారు.

## ఇతర వార్డులకు మార్చడంపై ఓటర్లు అసంతృప్తి.



**అమరాపురం సెప్టెంబర్ 22, తెలుగు స్వరం.** మడకశిర లో ఒకే ఇంటిలోని ఓటర్లు వివిధ వార్డులకు మార్చడం పట్ల ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అని మడకశిర పట్టణ వైఎస్ఆర్సిపి యువజన విభాగ అధ్యక్షుడు ఎస్.బాబు తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మడకశిరలో నగర పంచాయతీలో 23 వార్డు లో 17,337 మంది ఓటర్లు రానున్న స్థానిక ఎన్నికలకు మడకశిర నగర పంచాయతీలో 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో గతంలో 20 వార్డులు ఉండగా, వాటిని 23కు విభజించారు. పంచాయతీలో మొత్తం 17,337 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 8,416 మంది మహిళలు, 8,910 మంది పురుషులు, ఒక ట్రాన్స్ జెండర్ ఓటరు ఉన్నారు. వార్డుల పునర్విభజనలో సమీపంలోని వార్డులకు కాకుండా ఇతర వార్డులకు మార్చడంపై పలువురు ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందుకు అధికారుల స్పందించి ఒకే ఇంటిలో ఉండు ఓటర్లను వేరే వార్డులకు మార్చకూడదని ఆ ఇంటి ఓటర్లను అదే వార్డులో ఉంచాలని అధికారులను కోరారు.

## సెల్ టవర్ ఎక్కిన మతిస్థిమితం లేని వ్యక్తి



**సోమందేపల్లి సెప్టెంబర్ 22 తెలుగు స్వరం:** మండలంలోని చాకర్లపల్లి సమీపంలో మతి స్థిమితం లేని వ్యక్తి సెల్ టవర్ ఎక్కడంతో కలకలం రేగింది. మండలంలోని మాగే చెరువు గ్రామానికి చెందిన కురుబ మారుతి అనే వ్యక్తి ప్రతిరోజూ రోడ్లపై కేకలు వేస్తూ అటు ఇటు తిరుగుతూ ఉండేవాడు. మంగళవారం సెల్ టవర్ ఎక్కడంతో విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని కిందకు దించేందుకు ప్రయత్నించారు. అతని కుటుంబసభ్యులు రావడంతో సెల్ టవర్ నుంచి కిందకు దిగారు. మతి స్థిమితం లేకుండా ఉన్నందునే సెల్ టవర్ ఎక్కినట్లు పోలీసులు తెలిపారు.

## కష్టపడే నాయకులకు కార్యకర్తలకు అండగా ఉంటా.. మీ భవిష్యత్తు నాది - నారా లోకేష్

**మంత్రి లోకేష్ ను కలసిన పెనుకొండ టీడీపీ అధ్యక్షుడు శ్రీరాములు**



**పెనుకొండ సెప్టెంబర్ 22 తెలుగు స్వరం:** రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన జాతీయ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, విద్యా ఉ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని పుట్టపర్తి విమానాశ్రయంలో పెనుకొండ మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొల్ల శ్రీరాములు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెనుకొండ మున్సిపాలిటీలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల గురించి శ్రీరాములు యాదవ్ నారా లోకేష్ తో ప్రస్తావించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని నారా లోకేష్ భరోసా ఇచ్చినట్లు శ్రీరాములు తెలిపారు. "కష్టపడి పనిచేయండి.. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు, నాయకులకు నేను అండగా ఉంటాను. మీ భవిష్యత్తు నాది" అంటూ నారా లోకేష్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారని శ్రీరాములు తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు నాయకత్వం అండగా నిలవడం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని, నారా లోకేష్ మాటలు పార్టీ శ్రేణుల్లో మరింత నూతనోత్సాహాన్ని నింపాయని శ్రీరాములు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని శ్రీరాములు యాదవ్ తెలిపారు.

## కోస్తాంధ్రకు భారీ వర్ష ముప్పు

-మొదటిపేజీ తరువాయి

గంటల్లో మరింత బలపడనుంది. తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. వాయుగుండం సెప్టెంబర్ 23 రాత్రి నుంచి 24వ తేదీ తెల్లవారుజామున తీరం దాటే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్ మధ్య ఇది తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు.

### ఉత్తరాంధ్రపై ప్రత్యేక దృష్టి

వాయుగుండం ప్రభావంతో రేపు, ఎల్లుండి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురవనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలపై దీని తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు జారీ చేయాలని ఆమె ఆదేశించారు.

### మత్స్యకారులకు హెచ్చరికలు

సముద్రం అల్లకల్లోలంగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని ప్రభుత్వం హెచ్చరించింది. తమ పడవలు, వలలను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజల భద్రతపై అధికారులు దృష్టి సారించారు. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు, సహాయక చర్యల కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ఎల్లవేళలా సిద్ధంగా ఉంచాలని హోంమంత్రి అధికారులను ఆదేశించారు.

### ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉంది. అలాంటి ప్రదేశాలు, కాజ్‌వేల వద్ద వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రాకపోకలను కట్టడి చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈదురుగాలుల సమయంలో భారీ వృక్షాలు, భారీ హోర్డింగులు, శిథిలావస్థకు చేరిన పాత భవనాల వద్ద ప్రజలు ఉండకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. విపత్కర సమయాల్లో ప్రజలు అత్యవసర సహాయం కోసం 112, 1070, 18004250101 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## పూర్వీకుల ఆహారమే ఆరోగ్యం.

వివిధ రకాల తిండి పదార్థాలతో ఫుడ్ స్టాల్.

మునగ ఆకు బొకేలతో అతిథులకు స్వాగతం.

.....గోరంట్లలో ఘనంగా 9వ జాతీయ పోషణ మాసోత్సవం

హాజరైన... సిడిపిఓ శాంతలక్ష్మి , డిప్యూటీ డివైఓ జాన్ రెడ్డప్ప, ఎంఈఓ గోపాల్, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, ప్రిన్సిపాల్ భక్తవత్సలం.



**గోరంట్ల, సెప్టెంబర్ 22 తెలుగు స్వరం.** గోరంట్ల పట్టణంలోని ఐకెపి భవనంలో 9వ జాతీయ పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమతుల్య ఆహారం, పోషకాహారం, చిరుధాన్యాల వినియోగం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సోమందేపల్లి ప్రాజెక్టు సీడీపీఓ శ్రీమతి డాక్టర్ శాంత లక్ష్మి, గోరంట్ల మండల డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ , ఎంఈఓ-1 శ్రీ జాన్ రెడ్డప్ప, ఎంఈఓ-2 గోపాల్, ఏపీఎం బాబ్జి, ఎస్‌వీపీ ఎం కళాశాల ప్రిన్సిపల్ శ్రీ భక్తవత్సలం తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీడీపీఓ డాక్టర్ శాంత లక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో పిల్లలు, యువత ఎక్కువగా జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఫుడ్, అధికంగా ఉప్పు, చక్కెర మరియు కొవ్వు పదార్థాలు కలిగిన ఆహారాల వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ఇటువంటి ఆహారాన్ని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోవడంతో పాటు భవిష్యత్తులో వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల పిల్లలు, గర్భిణీలు, బాలింతలు మరియు కుటుంబ సభ్యులు పోషక విలువలు కలిగిన సహజ ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.ఎంఈఓ-1 శ్రీ జాన్ రెడ్డప్ప మాట్లాడుతూ, మన పూర్వీకులు అనుసరించిన సాంప్రదాయ ఆహార విధానంలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. పూర్వకాలంలో అందుబాటులో ఉన్న స్థానిక ధాన్యాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకునేవారని, అలాంటి సంప్రదాయ వంటకాలను తిరిగి మన ఆహారంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గోరంట్ల మండల డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ, చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, అరికెలు వంటి చిరుధాన్యాలు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలని తెలిపారు. వీటిలో పీచు పదార్థాలు, ఖనిజాలు మరియు ఇతర పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, కుటుంబ ఆహారంలో చిరుధాన్యాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎస్‌వీపీ ఎం కళాశాల ప్రిన్సిపల్ శ్రీ భక్తవత్సలం మాట్లాడుతూ, మన ఆహారంలో అధికంగా ఉపయోగిస్తున్న నాలుగు తెల్లటి పదార్థాలైన తెల్ల బియ్యం, చక్కెర, ఉప్పు, మైదా వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని సూచించారు. ఎంఈఓ-2 శ్రీ గోపాల్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో చిన్న వయసులోనే అధిక బరువు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు కనిపిస్తున్నాయని తెలిపారు. వీటికి అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జంక్ ఫుడ్, అధిక చక్కెర మరియు శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలు ఉండవచ్చని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా "ఆరోగ్యకరమైన కుటుంబం -- పోషకాహారంతో కూడిన సమాజం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీడీపీఓ అంగన్వాడి కార్యకర్తల కు తెలియజేశారు. ప్రతి కుటుంబం సమతుల్య ఆహారాన్ని అలవాటు చేసుకుని, జంక్ ఫుడ్ మరియు అధిక చక్కెర, ఉప్పు, మైదా వంటి పదార్థాల వినియోగాన్ని తగ్గించి, స్థానికంగా లభించే పోషక విలువలున్న ఆహార పదార్థాలు మరియు చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు సూచించారు.

కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగరాణి ,శంకరమ్మ ,మంజుల అంగన్వాడీ కార్యకర్తలు, సోమందేపల్లి ప్రాజెక్ట్ యూనియన్ లీడర్ శ్రీదేవి,

మహిళలు, పాల్గొన్నారు.

## కూటమి మరింత బలంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

బహుమతిగా అందజేశారు. అనంతరం బహిరంగ సభలో పవన్ మాట్లాడారు.

ఉప్పాడ తీరంలో సముద్రపు కోత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. 323 కోట్ల రూపాయలతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. అమృత్ భారత్ స్కీమ్ కింద 35 కోట్లతో పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మరో నాలుగు నెలల్లో తన క్యాంపు కార్యాలయాన్ని పిఠాపురానికి మార్చనున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బహిరంగసభ వేదికగా జనసేన నేతలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చాక నాయకుల్లో వేడి తగ్గిందంటూ చురకలు అంటించారు. అదే సమయంలో కూటమి మరింత బలంగా ఉండాలని ఆకాంక్షించారు. నాయకుల ఆకాంక్షల కన్నా ప్రజల అవసరాలకు ముందు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

'పిఠాపురంలో శాశ్వత డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాం. రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో 2 ఎస్పీటీల నిర్మాణం చేపట్టాం. రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తున్నాం. రూ.34 కోట్లతో ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ పనులు ప్రారంభించాం. రూ.2 కోట్లతో కుంతీ మాధవస్వామి ఆలయ కోనేరును పునరుద్ధరించాం. మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలను ఏర్పాటు చేస్తున్నాం. 40 టన్నుల తడి చెత్తను శుభ్రం చేసే ప్లాంట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నాం.'

సభలో పాల్గొనడానికి ముందే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో 9 కోట్ల 59 లక్షల రూపాయలతో ఆధునీకరించిన నాగులపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్నిప్రారంభించారు. యూ.కొత్తపల్లి మండలంలోని సమగ్ర మంచినీటి సరఫరా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. పథకం వివరాలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. పిఠాపురం నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చేలా ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని సుమారు 52 ఆవాసాల్లో 97 వేల మందికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించేలా పథకాన్ని ఆధునీకరించారు. మార్గమధ్యంలో కొండేవారంలో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్‌ను కూడా ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ చీఫ్ గాయత్రి దేవి, చీఫ్ ఇంజినీర్ హరి రామ్ నాయక్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### స్వామివారి ప్రాతఃకాల సేవ

చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్నారు. ఏకాదశి వ్రతాచరణలో భాగంగా ఉదయం స్వామివారి ప్రాతఃకాల సేవలో పాల్గొన్నారు. రాములవారికి అష్టోత్తరాలతో పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన పవన్?కి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో చేబ్రోలు శ్రీ సీతారామస్వామి వారి ఆలయం సమీపంలో సభ నిర్వహించిన విషయం తెలిసిందే. మరోసారి స్వామివారిని దర్శించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. విజయం అనంతరం ఆలయ అభివృద్ధికి రెండు విడతలుగా దాదాపు రూ.90 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో ఆలయంలో కాలక్షేప మండపం, రథశాల, అన్నదానం కోసం హాలు, యాగశాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

## స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేస్తా భాజపా మండల కన్వీనర్ బాబ్జాన్...



**నంబులపూలకుంట, తెలుగు స్వరం,(బ్యూరో)** స్థానిక సంస్థ ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తామని నంబులపూలకుంట మండల భాజపా కన్వీనర్ బాబ్జాన్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తే తాను జడ్పిటిసి,ఎంపీటీసీ, సర్పంచ్,ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏదో ఒకటి అవకాశం ఇస్తే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. లేనిపక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తామన్నారు, మండల ప్రజలు ఆశీర్వాదం ఇస్తే పంచాయితీ పరిధిలో అభివృద్ధి చేసి ప్రజా సమస్యలపై ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేస్తానన్నారు. ప్రజలు గమనించి అభివృద్ధి చేసే వ్యక్తికి అవకాశం కల్పించాలన్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో నంబులపూలకుంట గ్రామ పంచాయతీకి సర్పంచ్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అవకాశమిస్తే పోటీ చేస్తా, లేనిపక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధమవుతానన్నారు, గ్రామపంచాయతీ ప్రజలు మంచి చేసే వ్యక్తిని ఓట్లు వేసి గెలిపిస్తే పంచాయతీ మరింత అభివృద్ధి చేస్తామని ప్రకటనలో తెలిపారు.

## 3వ వార్డు కౌన్సిలర్‌గా అవకాశం ఇవ్వండి

**సిక్స్‌మెన్ కమిటీకి బయోడేటా అందజేసిన టీడీపీ యువ నాయకుడు రియాజ్**



**పెనుకొండ సెప్టెంబర్ 22 తెలుగు స్వరం:** తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న తిమ్మాపురం వాసి, టీడీపీ యువ నాయకుడు షేక్ రియాజ్ బాషా పెనుకొండ 3వ వార్డు కౌన్సిలర్‌గా అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం పెనుకొండలోని అన్నా క్యాంటీన్‌లో సిక్స్‌మెన్ కమిటీ సభ్యులను కలిసి తన బయోడేటాను అందజేశారు.పార్టీ కోసం ఎన్నో ఇబ్బందులు ఎదురైనా టీడీపీని వీడకుండా పార్టీకి అండగా నిలిచానని రియాజ్ తెలిపారు. భవిష్యత్తులోనూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని, మంత్రి సవిత నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. 3వ వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రియాజ్ తెలిపారు.

## గర్భవతులకు వైద్యపరీక్షలు



**సోమందేపల్లి, సెప్టెంబర్ 22, తెలుగు స్వరం:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని వైద్యాధికారి ఓంకార్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భవతులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మండలంలోని తుంగోడు, గుడిపల్లి, చల్లాపల్లి, పందిపర్తి, కేతగానిచెరువు గ్రామాల నుండి వచ్చిన గర్భవతులకు బి. పి, మధుమేహం, హీమోగ్లోబిన్, ఎత్తు, బరువు, పిండస్థ పరీక్షలు నిర్వహించారు. పలువురికి స్కానింగ్ కొరకు హిందూపూర్ కు రిఫర్ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. పరీక్ష ల నిమిత్తం వచ్చిన గర్భిణీ లకు పెనుకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు పౌష్టికాహర భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ పార్వతమ్మ, పర్యవేక్షకులు రవీంద్ర, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప.



**అమరాపురం సెప్టెంబర్ 22 తెలుగు స్వరం.** నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎస్.ఎల్. ఈరలక్కప్ప ఆధ్వర్యంలోపార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ తదితర స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా ఐదు మండలాల్లో ఐడి కార్డు లను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం రొళ్ల మండలంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనంతరాజు, రొళ్ల మండల కన్వీనర్ సంతోష్, మాజీ సర్పంచ్ ప్రకాశ్, రొళ్ల మండల వైస్ ప్రెసిడెంట్ నగేష్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ, సర్పంచులు, పంచాయతీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. RNI No: APTEL /25/A5612 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881